## క్లుప్తంగా

### శ్రీమారుతీనగర్ కాలనీ అధ్యక్షుడిగా సైదులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీమారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడిగా ఎగిరి శెట్టి సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని నియామకానికి పూర్తి సహకారం అందించిన కాలనీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇతర కార్యవర్గ సభ్యులను త్వరలో ఎన్నుకుంటామని స్పష్టం చేశారు. శ్రీనివాసులు, బాపనయ్య, ప్రవీణ్, వెంకట్రామ్‌రెడ్డి, సంతోస్, పవన్, ప్రసాద్, చుక్కయ్య, నర్సింహ, ఈశ్వర్, శివానంద్, కిషన్, సతీష్, విక్రమ్, వెంకటేశ్, కార్తీక్, శివ, రవి, సత్యనారాయణ, రాజేశ్, శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

### రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు: కొత్త పట్టాదారుగా మారిన రైతులు ఈ నెల 13వ తేదీ లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన వారు, గతంలో అర్జీ పెట్టుకోని పట్టాదారు పాస్‌పుస్తం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ జిరాక్స్‌లను దరఖాస్తుకు జతచేసి రైతు వేదికలో వ్యవసాయ అధికారులకు అందజేయాలని సూచించారు. గతంలో బీమా చేసుకున్న వారు.. ఏమైనా మార్పులు చేర్పులు చేసుకోవాలని అనుకుంటే.. నేటితో ఆఖరి తేదీ అని, వెంటనే చేసుకోవాలన్నారు.

### ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

బడంగ్‌పేట్: ప్రతి దుకాణదారుడు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని.. లేదంటే షాపులను సీజ్ చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ జాన్ కృపాకర్ హెచ్చరించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా 68వ రోజు సోమవారం కమిషనర్ పి.సరస్వతి ఆదేశాల మేరకు ఆయన దుకాణాల తనిఖీ చేపట్టారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని, పాత లైసెన్సులు రెన్యూవల్ చేయించుకోవాలని చెప్పారు. లైసెన్సులు తీసుకోకుండా క్రయవిక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

# బీమా.. రైతుకు ధీమా

- కొత్త దరఖాస్తులకు ఆహ్వానం
- రేపటితో ముగింపు

మహేశ్వరం: రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. ప్రమాదవశాత్తు లేదా సాధరణంగా రైతు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు బాసటగా నిలుస్తోంది. ప్రీమియం డబ్బులు సర్కారు చెల్లిస్తూ.. పరిహారంగా రూ.5 లక్షలు అందజేస్తోంది. బీమా పథకానికి మహేశ్వరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 47,036 మంది రైతులు నమోదు చేసుకున్నారు. 2024- 25లో 89 మంది మరణించగా.. క్లైమ్‌గా రూ.4.45 కోట్లు నామినీ ఖాతాలో జమ అయ్యాయి. ఇప్పటి వరకు బీమా చేసుకున్న వారికి వ్యవసాయ అధికారులు రెన్యూవల్ చేయనున్నారు.

**కొత్తగా మరో 2 వేల మంది**

రైతుబీమా కోసం అధికారులు రైతుల నుంచి ఏటా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుత సంవత్సరం అర్జీలు స్వీకరిస్తున్నారు. అందుకు ఈ నెల 13వ తేదీ వరకు ముగింపు గడువు ఉందని మహేశ్వరం వ్యవసాయ శాఖ ఏడీఏ సుధారాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి తెలిపారు. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల నుంచి కొత్తగా మరో 2 వేల మంది వరకు దరఖాస్తు చేసుకోనున్నట్లు అంచనా. వీరితో పాటు ఇప్పటి వరకు బీమా నమోదు చేసుకోని వారు, కొత్తగా పట్టా పాసు బుక్‌లు పొందిన వారి నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. అంతే కాకుండా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతు నామిని పేర్లు మార్పు చేసుకునే అవకాశం కల్పించారు. బీమాకు 18 నుంచి 59 ఏళ్లవారు అర్హులని పేర్కొన్నారు.




దరఖాస్తు ఫారానికి రైతు ఆధార్, పట్టా పాసు బుక్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జతచేసి, సంబంధిత రైతు స్వయంగా రైతు వేదిక లేదా వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని స్పష్టం చేశారు.

**బీమా పథకం 2024- 25 మహేశ్వరం డివిజన్**

| మండలం | రైతులు | బీమా పొందిన వారు | జమైన డబ్బులు |
|---|---|---|---|
| మహేశ్వరం | 18,547 | 38 | రూ.1.90 కోట్లు |
| కందుకూరు | 27,708 | 43 | రూ.2.15 కోట్లు |
| బాలాపూర్ | 781 | 08 | రూ.40 లక్షలు |
| మొత్తం | 47,036 | 89 | రూ.4.45 కోట్లు |

## మురుగునీటి సమస్యకు పరిష్కారం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో గత కొన్ని రోజులుగా రోడ్డుపై పారుతున్న మురుగునీటి సమస్యకు అధికారులు పరిష్కార చర్యలు చేపట్టారు. ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి దిగువకు గతంలో వేసిన పైపులైన్ పరిమాణం చిన్నదిగా ఉండడంతో ఎగువ నుంచి వచ్చిన మురుగు నీరు మ్యాన్‌హోల్ నుంచి పైకి ఎగబాకి రోడ్డుపై పారుతూ వచ్చింది. దీంతో బాటసారులకు కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించిన మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పాత లైన్ స్థానంలో పెద్ద సైజ్ పైపులను వేయించారు. ఈ పనులను డీఈ ఇష్రత్ ఆయేషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రతన్ పర్యవేక్షించారు. పనులు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


కొనసాగుతున్న పైపులైన్ పనులు

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

కందుకూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ రవికుమార్ అన్నారు. మండల పరిధి బేగరికంచెలో సోమవారం ఆర్‌బీఐ సౌజన్యంతో వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలెప్‌మెంట్ సొసైటీ, కందుకూరు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జనసురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా.. కేంద్రం బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఎస్‌ఎస్‌వై, ఏపీవై పథకాల గురించి అవగాహన కల్పించారు. జనధన్ ఖాతాల గురించి వివరించారు. సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు ఎస్‌కే. రఫియా, మల్లేశ్, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకట్రామ్

**మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్**

పహాడీషరీఫ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవకలకు తావులేకుండా వ్యవహరిస్తున్నామని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. సోమవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో 271 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఇందులో 125 ఇళ్లకు గ్రౌండింగ్ చేశామన్నారు. పలు కారణాలతో 142 మంది నిర్మాణానికి ముందుకు రాలేదని తెలిపారు. కొత్తగా వారి జాబితాను కలెక్టర్‌కు పంపించామన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

## వరదనీటి సమస్యను పరిష్కరించండి


డీఈఈకి సమస్యలు వివరిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

**ఏఐసీసీ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి**

బడంగ్‌పేట్: ఎడతెరిపి వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ 26,5వ డివిజన్‌లలోని వినాయకహిల్స్–2లోని కాలనీల్లో డీఈఈ వెంకన్న, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీలను పరిశీలించారు. వినాయకహిల్స్ ఉపాధ్యక్షుడు శంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, శర్మ, భరత్, మురళీధర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం


సన్మానం పొందిన సభ్యులు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యులుగా ఆరుగురు సభ్యులను దేవాదాయ ధర్మదాయ శాఖ నియమించింది. ఈ మేరకు గోనమాని బాల్‌రాజు, తోడేటి గోవర్ధన్‌రెడ్డి, పోట్ల అర్జున్, ఎరుకల శ్రీలత, కోటగళ్ల పల్లవి, మద్దుల చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం షురూ


ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ 42వ వార్షికోత్సవం (కల్యాణం, బోనాలు) సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గణపతిపూజ, హోమం నిర్వహించారు. అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. మంగళవారం కల్యాణం, బోనాలు ఘటం ఊరేగించనున్నారు. అమ్మవారి దర్శనం కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, దేవాదయ శాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మెహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కాశీనాథ్ పాల్గొన్నారు.